# పాశం

కె. రామలక్ష్మి



కంటికీ మంటికీ ఏక ధారగా ఏడుస్తూంది సీతమ్మ. సీతమ్మ తల్లి పేరులోనే ఏడ్పు వుందో లేదో తెలియదుగాని, ఆ తల్లి గంగను నెత్తిన పెట్టుకు పుట్టిందన్నది మటుకు నిజం అని చెప్పగలను. సీతమ్మ పుట్టింది మొదలు కంట తడిపెట్టని క్షణం లేదని అందరికీ తెలుసు. తల్లి సీతమ్మ శోకానికి పెట్టింది పేరైపోయిందంటూ అయినవాళ్ళూ, కానివాళ్ళూ ఎప్పుడూ అనుకుంటూనే వున్నారు. కని, పెంచి పెద్దచేసిన తల్లిదండ్రుల పాశం ఎంత గట్టిదో గాని పుట్టిన దగ్గర్నుంచీ ఎప్పటికప్పుడు కింద పెట్టడమే! ఏ కనుపించని దేవతలో కరుణించి బ్రతకడం. మళ్ళీ తల్లి ఆప్యాయంగా అక్కున చేర్చుకోవడం సీతమ్మ చిన్నప్పుడు అలవాటైపోయింది. 'పిల్ల కాస్త పెద్దదై గడ కట్టిందంటే బాగానే వుంటుంది. చాలా మందిలా చిన్నప్పుడు అర్భకంగా వున్నవాళ్ళు పెద్దయ్యాక బాగుంటారు' అంటూ సీతమ్మగారి తల్లిని చుట్టూ వున్నవాళ్ళు ఓదారుస్తూ వుండేవాళ్ళు. ఏడెనిమిదేళ్ళు వచ్చేదాకా అలా చస్తూ, బ్రతుకుతూనే పెరిగింది సీకమ్మ. 'అంత చిన్నదాన్ని పట్టుకుని 'సీతమ్మా!' అంటారేమిటి! ముద్దుగా 'సీతా' అని పిలవండంటూ తల్లి చెవినిల్లు కట్టుకు పోరినా-ఎవరూ ఏమరుపాటున కూడా

'సీతా'అని పిలిచేవాళ్ళు కాదు. విశాలంగా వుండే ఆ కళ్ళు చేపల్లా మిలమిల్లాడినా గట్టునపడ్డట్టు ప్రశాంతంగానే వుండేవి. పచ్చని పసిమికి కాస్త రక్తం చిందినట్టుండే ఆమె ఒళ్ళు యింకా తీగలు సాగని అందాలని దాచివున్నట్టుండేది. వీపున తాడును కట్టుకున్నట్టు ఆమె వాలు జడ చూపరుల దృష్టిని ఆకర్షిస్తూ క్షణం నిలువలేనట్టు కదిలాడేది. కట్టుకున్న పరికిణీ, దానిమీది వల్లెవాటు ఏదో శిల్పి చెక్కిన బొమ్మకి అమర్చినట్టుండి - 'తల్లి దిష్టే తగిలేను' అనుకుని కళ్ళకి నల్లగా యింత కాటుక పెట్టేది సీతమ్మకి కన్నతల్లి.

అందరూ చెప్పినట్టే సీతమ్మ ఆరోగ్యం వయస్సుతోపాటు బాగుపడింది. ఆరోగ్యంతో పాటు చలాకీతనం పెరిగిన సీతమ్మ అందరి దృష్టినీ ఆకర్షించే అందకత్తెగానే తయారైంది. అందుకే 'మా అబ్బాయి కివ్వండి' అంటూ అడగవచ్చేవారు ఎక్కువయ్యారు. సీతమ్మ నాన్నగారి కీ విషయం చాలా గర్వకారణంగా వుండేది. 'నా పిల్లకేమే! బంగారపు బొమ్మ కదా!' అంటూ పెళ్ళాం దగ్గర మీసం మెలివేసేవాడు. 'మేనరికం వుండగా ఎవరెన్నిసార్లు అడిగితే మనకెందుకండీ!' అని ఆయన ఉత్సాహం మీద కాస్త చన్నీళ్ళు చిలకరిస్తూ వుండేది సీతమ్మ తల్లి.

సీతమ్మ వయస్సుతో పాటు పెరిగిన అందంతో అందరి కళ్ళకీ పండుగగా వుండే రోజుల్లోనే ఎన్నో సంబంధాలను కాదని, ఓ శ్రీరామ్మూర్తికి యిచ్చి పెళ్ళిచేశారు. 'ఇద్దరిదీ-చక్కని జోడీ. నీ కూతురూ అల్లుడూ ఓ చోట నిలిస్తే పెళ్ళి పందిరిలో వేరే దీపం అక్కరలేదే' అంటూ పేరంటాళ్ళు-సీతమ్మతల్లిని వేళాకోళాలు కూడా చేశారు.

కొత్త పెళ్ళికూతురైన సీతమ్మ ఎంతో ఉత్సాహంగా అత్తవారింట అడుగుపెట్టింది. ఆ పల్లెలో గృహప్రవేశం చేశారేగాని కాపురం పెట్టలేదు. సీతమ్మ భర్తకి పట్నంలో ఉద్యోగం. అందుకే లాంఛనంగా తల్లిదండ్రులతో నాల్గు రోజులు గడిపి పట్నంలోని తన యింటికి తన సొత్తుని తెచ్చుకున్నాడు శ్రీరామ్మూర్తి. ఇద్దరూ ప్రేమ తింటూ, ప్రేమ పీలుస్తూ హాయిగా వుంటూ 'సీతమ్మ కంట తడి పెట్టే రోజులింక అయిపోయాయి' అని కాలం నమ్మించింది. 'సీతమ్మ కష్టాలింక తేరిపోయాయి. యింక హాయిగా నవ్వుతూ కాలం గడపడమే తరువాయి' అంటూ సీతమ్మ తరపు వారంతా అనుకున్నారు.

కాని అంతా ఎదురు చూసినట్టే జరిగితే సీతమ్మ కథ తెలుగు సినిమా కథే అవును! కాని అలా

జరగలేదు. భగవంతుడు తీరిగ్గా కూర్చుని ఏ మొరమరాలో నము లుతూ కాళ్ళదగ్గిర పడివున్న చిన్ని కుక్కపిల్లని పరదాకి కంచీతో కొట్టి నట్లున్నాడు! 'కుయ్.కుయ్' మంటూ చుట్టపెట్టుకుపోయింది. ఆ కుక్కపిల్లే సీతమ్మ అని నా గట్టి నమ్మకం. లేక పోతే ప్రశాంతంగా సాగిపోతున్న సీతమ్మ జీవితం హఠాత్తుగా ఇలా అల్లకల్లోలం కావడానికి తగినంత కారణం ఏదీ కనిపించదు నాకు.

అది విధి అనండి, తలరాత అనండి- ఏమైనా అనండి. నేను డాక్టరుగా బోర్డు కట్టిన నెలలోగానే సీతమ్మ నా పేషెంటుగా వచ్చింది. కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్టు కొత్తగా వృత్తి ప్రారంభించిన నాకు అన్ని కేసుల్లోనూ కుతూ హలం ఎక్కువే! అందరు పేషెంట్లు ఏదో నాకు చాలా దగ్గర వాళ్ళు అన్నట్టు వారిబాధ నా బాధగా, వారి రోగం నా రోగంగా తెగ ఇదై పోయేదాన్ని. ఆడ డాక్టర్ని కావ డంతో పురిటి కేసుల గిరాకీ చాలా ఎక్కువగా వుండేది. ఓ సారి సాయంత్రం పూట కారులో శ్రీరా మ్మూర్తిసీతమ్మను తీసుకువచ్చాడు. ఆయన ముఖం భయంతోనో మరి ఎందుకో ఎర్రగా కందిపోయి వుంది. తుడుచుకుంటున్న కొద్దీ చెమటలు మళ్ళీ పట్టేస్తున్నాయి. 'నాలుగు రోజులనుంచి నలతగానే వుందండీ. ఎవరూ లేదీ డాక్టరు తెలియలేదు' అన్నాడు వరిచ యంగా. 'మీరేం కంగారుపడకండి ఆమె కేం వుండి వుండకపోవచ్చు. బహుశా మీ శ్రీమతి నెలతప్పి వుండవచ్చు' అని ధైర్యం చెప్పి సీతమ్మని లోపలికి తీసుకెళ్ళాను. సీతమ్మకు నెలతప్పింది. "ఎన్నాళ్ళ నుంచి ఇలా వుంది?" అడిగాను.

"మామూలుగానే యిలానే వుంటుందండీ." అంది సీతమ్మ.

ఇద్దరినీ కూర్చోపెట్టి విశదీక రించాను-సీతమ్మకి అప్పుడే మూడు నెలలు దాటి వుంటాయి. చాలా బలహీనంగా వుంది. కొన్నాళ్ళ పాటు మందులు తీసుకుంటూ లేవ తిరక్కుండా వుంటే యీ గర్భం దక్కే అవకాశం వుంది. అదే వివరంగా చెప్పాను.

సీతమ్మకి దబ్బపండు లాంటి పిల్లవాడు పుట్టాడు. అన్ని లాంఛ నాలతో బారసాల చేసుకుని సుకుమార్ అని నామకరణం చేసు కున్నారు. అంటే వాళ్ళ మనస్సులో వాడు చాలా సుకుమారమైన వాడని! అందుకే వాళ్ళమ్మ వాడు కడుపులో వున్నప్పుడు అన్ని మందులు తీనుకోవలసి వచ్చిందని! కాని అమాయకులు! ఆ సుకుమా రుడిలో ఏ మాత్రం చైతన్యం లేదని గ్రహించ లేకపోయారు. కాని డాక్టరుగా నా కెంతో బెంగ

అనిపించింది. చెప్పీ చెప్పకుండా నేను శ్రీరామ్మూర్తికి చెప్పాను. 'కుర్రవాడు కాస్త రోగగ్రస్తుడుగా పుట్టినట్టున్నాడు. ముందే డాక్టర్లకి చూపిస్తే నయం' అని. ఆయనకి ఏం రోగం అన్న బెంగ కంటే యింత త్వరగా గుర్తించిన నా తెలివికి ఆనందం కల్గింది. అంత మంచివాడాయన. అది మొదలు చాలా మంది నిపుణులకి వాణ్ణి చూపెట్టడం అయింది. అందరిదీ ఒకటే తీర్పు. వీడొక మందకొడి సంతతి ఇలాగే పెరిగి పెద్దవాడౌతాడు. మీ అదృష్టం బాగుంటే లేచి తిరుగుతాడు. లేకపోతే అలాగే మంచాన గడుపుతాడని.

మగవాడు కనుక శ్రీరామ్మూర్తి వార్త ధైర్యంగా విన్నాడు కాని సీతమ్మ విరుచుకు పడిపోయింది. అది మొదలు సీతమ్మ తలమీది గంగ కళ్ళు తెరచి ప్రవహించడానికి విజృంభించినట్టయింది.... ఆమె కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చింది. కనబడని దేవతలందరికీ మొక్కులు మొక్కింది.... 'నీకు పిచ్చా సీతమ్మా!దైవం వేసిన శిక్ష యిది. దీనికెవరూ బాధ్యులు కారు. ధైర్యంగా వుండడమే మనం చేయగల్గింది' అంటూ పెళ్ళాన్ని ఓదార్చాడు రామ్మూర్తి. ఆ రోజు సాయంత్రమే చక్కని అల్సేషియన్ కుక్కపిల్లని తెచ్చి. 'దీన్ని పెంచుకో' అంటూ భార్యకి కాస్త మనస్సు మారడంకోసం ఇచ్చాడు.

తరవాత ఆ దంపతులకి నా అవసరం ఎక్కువ కలగనేలేదు. కుక్కపిల్లకి సుల్తాన్ అంటూ గొప్ప పేరుపెట్టింది సీతమ్మ. ఒకసారి వేళాకోళం చేస్తే 'సుకుమార్ అంటే అలా అయిపోయాడు నా కొడుకు. ఇదేనా సుల్తాన్ లా ధైర్యంగా పెరుగుతుందని' అంటూ చాలా పేలవంగా నవ్విందిసీతమ్మ. నవ్వినా ఆమె కళ్ళు నవ్వడం నేనెప్పుడూ చూడలేదు. నీటిపొర కింద నుంచి ఆ కళ్ళు గాజు కళ్ళలాగా కనిపించేవి. వాటిలో భావాలు చదవడం కష్టం. వాటిలో అసలే భావాలూలేవు....సుల్తాన్ నెల తిరిగే లోగా ఎదిగిపోతూ సీతమ్మ కన్నుల పంట అయింది. సుకుమార్ మంచంలో వుండే తల్లిమనసు రంజిల్లేలా పుట్టినరోజు తరువాత పుట్టినరోజు చేసుకుంటూ, బొద్దుగా శరీరం పెంచుకుంటూ వస్తూనే వున్నాడు.వాడి కిష్టమైనవని గ్రహించిన స్వీట్లు తెగ చేసిపెట్టేది సీతమ్మ. సీతమ్మ చేతిలో స్వీట్లు చూడగానే అవ్యక్తమైన ఆనంద ప్రదర్శనకి చిహ్నంగా ఏవేవో చప్పుళ్ళు చేసేవాడు సుకుమార్. అదే చాలు ఆ తల్లి మనస్సు ఉప్పొంగి పోడానికి! లాక్కున్నంత ఆత్రంగా వాటిని లాక్కుని మింగేసేవాడు....ఏళ్ళు

పెరిగినా మెదడు పెరగని సుకుమార్ కోసం శ్రీ రామ్మూర్తి చేయని ఖర్చులేదు. సీతమ్మ తిరగని తీర్థంలేదు. క్షేత్రం లేదు. వాడినీ, ఆ యింటినీ కాస్తూ సుల్తాన్‌మటుకు ఆ వీధికే- ఒణుకు పుట్టించేలా తయారైంది!

కాలగర్భంలో చాలా సంవత్సరాలు కలిసిపోయాయి. నేను వృత్తి రీత్యా మారకపోయినా, జీవిత భాగస్వామితో పాటు-దేశం నాల్గు చెరగులా తిరగడం ప్రారంభించాను. వారిని మూడేళ్ళపాటు విదేశాలలో వేశారు. నేనూ వెళ్ళిపోయాను. నా కేరీర్‌లో ఎంతోమంది రోగులతో పరిచయం ఏర్పడ్డా, సీతమ్మతో నా అనుబంధంలా ఏ ఒక్కరితో ఏర్పడ లేదు.ఎప్పుడేనా ప్రశాంతంగా కూర్చున్నప్పుడు సీతమ్మ ఎలా ఉందో ననిపించేది. సుకుమార్‌లో ఏమైనా మార్పు వచ్చిందేమోనన్న చిన్న ఆశ వెల్గినట్టే వెల్గి చటుక్కున ఆరిపోయేది.. ప్రయివేటు ప్రాక్టీసు పెట్టాక పోసిన తొలి పురుడు సీతమ్మది. అదిటువంటి సంతానం కావడం-నా మనస్సు మీద చెరగని ముద్ర వేసింది. ఆ తరువాత ఏ వూళ్ళో కాపురం వుంటే ఆ వూళ్ళోనే ప్రాక్టీసుపెట్టి మొత్తం మీద నేను ఎన్ని వేల పురుళ్ళు పోశానో....

జీవనచక్ర పరిభ్రమణంలో దాని క్రింద పడి ఎన్నో విండైన జీవాలే కాలగర్భంలో కలిసిపోతూ వుంటాయి. ఓ ఇరవై సంవత్సరాల సాంసారిక జీవితం నాలో ఒక రకపు శాశ్వతత్వపు ముద్ర వేసుకుపోయింది. నాకూ ఏదైనా కష్టం వస్తుందన్న అనుమానం కూడా రాని ఓ తరుణం చూసుకుని ఏదో అదృశ్య హస్తం మావారిని లాక్కెళ్ళి పోయింది. నిండైన జీవితం గడిపాం. ఎవరి వ్యక్తిత్వం వారి కున్నవాళ్ళం కావడంతో, నేను కష్టం నుంచి నిలదొక్కుకోగల్గాను. మళ్ళీ వదిలిన జీవిత వనరుల కోసం పని ప్రారంభించాను. మళ్ళీ తొలిసారి ప్రాక్టీసు పెట్టిన వూళ్ళోకే వచ్చి స్థిరపడ్డాను. ఒక ఇల్లు కొని ప్రాక్టీసు ప్రారంభించాను. నా చెంపలు నెరిసాయి. పాపిటలో తెల్ల వెంట్రుకలు పరుచుకున్నాయి. కంటికి దళసరి అద్దాలు వచ్చాయి. కాని నా చేతుల్లో చేవ తగ్గలేదు. రోగులపట్ల నా ఆశ చావ లేదు. నే నచ్చేశానని తెలిసిన నా పాత కాతాదారులంతా పల్కరింపుగా రావడం మొదలు పెట్టారు. సీతమ్మ? సీతమ్మకూడా యిలాగే రాకపోయిందా? సుకుమార్ ఎలా వున్నాడో? .... నా ఊహల్లో ఆ పిచ్చి తల్లి కదిలాడింది.

ఆ రోజు సాయంత్రం తెరిపి చేసుకుని వాళ్ళుండే పాత ఇంటికి

వెళ్ళాను, అక్కడా యిల్లు లేదు. అగ్గిపెట్టెలు పేర్చినట్లు అంతస్తులు అంతస్తులుగా ఫ్లాట్లు కట్టేశారు. ఆ యిల్లు కల ప్రాంతం అమ్మేసి శ్రీరామ్మూర్తి వూరికి దూరంగా భవంతి కట్టుకున్నాడని విన్నాను.

ఆ రోజు వీలవక మర్నాడు శ్రీరామ్మూర్తి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను.

కారు ఆగగానే వరండాలో కూర్చుని వున్న పెద్ద మనిషి తలెత్తాడు పేపరులోంచి, రుమ్మాలుతో ముఖం తుడుచుకున్నాడు. అది నేను చూడకపోతే ఎవరో అనుకునేదాన్ని. నన్ను చూడగానే శ్రీరామ్మూర్తి కళ్ళు ఒక్క మెరుపు మెరిశాయి. "ఎలా వచ్చారు సరిగ్గా టైముకి!" అంటూ ఆనందంగా, ఆత్రంగా లేచి పరుగెత్తి వచ్చి నా చెయ్యి అందుకున్నాడు. ఆ ఆప్యాయతకి నా కళ్ళు చెమర్చాయి.

"సీతమ్మ ఎలా వుంది?" ఆత్రంగా అడిగాను.

"నిన్ననే సుల్తాన్ చచ్చిపోయింది. ఏడుస్తూంది" చాలా నిర్లిప్తంగా అన్నాడు రామ్మూర్తి.

"సుకుమార్?" - అలా అడిగి వుండకూడదని అనిపించింది నాకు.

"బాగానే వున్నాడు. రండి" అంటూ లోపలికి దారి తీశాడు. ఇల్లు బాగా విశాలంగా వుంది. మేడకి మెట్లు లేవు. సాఫీగా సాగిపోయే రంప్‌లా కట్టాడు. అది నేను గమనించడం చూసి "చక్రాల కుర్చీ కోసం మెట్లు కట్టలేదు." అన్నాడు రామ్మూర్తి.

సీతమ్మ కొడుకు గదిలో వుంది. చేతిలోవన్నీ ఒక్కసారి లాగేసినట్టున్నాడు- పెనుగులాడి అలసిపోయినట్టుందామె ముఖం.

నన్ను చూడగానే ఒక్కసారి దుఃఖం పెల్లుబికింది కాబోలు. "డాక్టరు గారూ" అంటూ నా పైబడి శోకించడం ప్రారంభించింది.

"ఛ, అలా ఏడవకూడదు." ఓదార్చాలని చూశానుగాని, ఆ మాటలు నాకే పేల్లీగా వినిపించాయి.

మంచం మీద వున్న సుకుమార్ బలమైన యువకుడిలా వున్నాడు. కాని జీవకళ లేదు, ఆ కళ్ళు ఏం చూస్తున్నాయో తెలియడం లేదు. కొత్తగా ఎవరో వచ్చారన్న గుర్తింపు లేదు!

మేం హాల్లోకి నడిచాం.

"డాక్టరుగారూ! మీరు చెప్పండి వారికి, సుకుమార్‌ని పంపించేస్తానంటున్నారు" ఏడ్చింది.

"నువ్వెళ్ళి డాక్టరుగారికి కాఫీ పట్రా" శ్రీరామ్మూర్తి సీతమ్మని పంపించేశాడు.

"సుల్తాన్‌కి పదిహేను రోజుల క్రిందటే జబ్బుచేసింది. చంపించేయాలన్నారు. కాని సీతమ్మ ఒప్పుకోలేదు. 'చచ్చిపోయేదాకా

నై నా నన్ను చేయ నివ్వండి' అంటూ గోల చేసింది. సుల్తాన్ చచ్చిపోయింది. కాని డాక్టర్, మీరు సీతమ్మని చూశారా? ఎలా అయిపోయిందో గుర్తించారా" మౌనంగానే తలూపాను.

"ఆ కళ్ళకింద నల్లగా వలయాలు. జవసత్వా లుడిగిపోయి పట్టుమని ఏభై కూడా రాకుండానే ఒగ్గు అయిపోయింది. వాడా ఏనుగున్నలా తయారయ్యాడు. బుర్ర లేనివాడికి బలం ఎక్కువ కాబోలు, తల్లి నొక్క తోపు తోసేస్తాడు. పెట్టబోతున్నది లాక్కుంటాడు. వాడి ధాటికి యింక సీతమ్మ ఆగలేదు డాక్టరుగారూ."

"మీరేం చేద్దా మనుకుంటున్నారు?"

"ఆస్పత్రికి అప్పగించాలని. వాడి పేర ఓ ముప్ఫయివేలు విరాళము యిస్తాను. వాడు బ్రతికి వున్నంతకాలం వాళ్ళే వాణ్ణి పోషిస్తారు"-కాఫీ పట్టుకొస్తున్న సీతమ్మ యీ మాట విన్నట్టుంది.

"చూడండి డాక్టరుగారూ, చచ్చిపోయేదాకా సుల్తాన్‌కి చేసినదాన్ని నా కొడుక్కి చేయలేనటండీ, ఈయన పిచ్చిగాని" అంటూనే కాఫీ అందించింది. కాఫీకప్పు పట్టుకున్న సీతమ్మ చెయ్యి సన్నగా ఒణకడం నేను గమనించకపోలేదు.

"మీవారు చెప్తున్నదాంట్లో అర్థం లేకపోలేదు." అన్నాను నెమ్మదిగా.

"మీరూ అలాగే అంటున్నారా?" చాలా విషాదంగా అంది సీతమ్మ.

శ్రీరామ్మూర్తి గారక్కణ్ణుంచి లేచి వెళ్ళారు.

నేనూ సీతమ్మా చాలాసేపు కూర్చున్నాం. ఎన్నో విధాల ఆమెని ఒప్పించాలని చూశాను, "మీరలా మోహం పెంచుకోవడమే గాని సుకుమార్ మీ కోసం బెంగపెట్టుకోడు, ఏమో! అక్కడి డాక్టర్ల ప్రయోగాలవల్ల కొంచెం మెరుగైనా ఆశ్చర్యం వుండ"దన్నాను.

"కని పాతికేళ్ళు పెంచాను. వీడూ సుల్తాన్‌లా నా కళ్ళముందు చచ్చిపోతే కనీసం నాకు తృప్తిగా వుంటుంది." అంది.

"ఈ పాతికేళ్ళలో ఏ ఒక్క రోజైనా మీ బొమ్మని మీరు అద్దంలో చూసుకున్నారా! పాతికేళ్ళలో ఒక్క రోజైనా నిండుగా నవ్వుకున్నారా? కంటికి నిండుగా నిద్రపోయారా? కడుపు నిండా తిండి తిన్నారా? యీ పాతికేళ్ళలో మీ వయస్సు ఒక్క పాతిక కాదండీ, మూడు పాతికలు పెరిగిపోయింది. పిచ్చివాడి బలం ముందు అర్భకులు మీరేం చెయ్యగలరు? అతగాడిని అటు యిటు కదిలేచ్చే ఓపిక కూడా లేదు మీకు. రాను రాను యింకా కష్టం అవుతుంది. మీరు నా మాట నమ్మండి, యిలా ఆస్పత్రిలో వుంచడం - మీకూ, అతనికీ కూడా

మంచిదనిపిస్తూంది నాకు. పోనీ కనీసం కొంతకాలం వుంచి చూడడానికైనా ఒప్పుకోండి. మీ వారి మనస్సుకూడా మీరు ఆలోచించాలి కదా!" అంటూ లేచాను.

సీతమ్మ మరేం మాట్లాడలేదు.

భార్యాభర్తలిద్దరూ కారుదాకా వచ్చి సాగనంపారు.

"వస్తూ వుంటానులెండి" అంటూ కారెక్కాను.

మరునాడే శ్రీరామ్మూర్తి చాలా ఉత్సాహంగా నా దగ్గరకి వచ్చారు. "సీతమ్మ ఒప్పుకుందండీ! అన్ని ఏర్పాట్లూ చేశాను. దాన్ని చూస్తే నా కడుపు తరుక్కుపోతూంది. పైకి గట్టిగా ఏడ్వలేను. ఈ దుఃఖాన్ని దిగమింగుకోలేను. రేపు సాయంత్రం మీరు వస్తే సుకుమార్‌ని సూపర్నెంటు గారికి అప్పగించి వద్దాం" అన్నారు.

అనుకున్నట్టు మర్నాటి సాయంత్రం సుకుమార్‌ని తీసుకుని ఆస్పత్రిలో అడుగుపెట్టాం. అదృష్టవశాత్తూ అది ఆస్పత్రిలో కాస్త ప్రశాంతంగా వుండే సమయం. ఏ గోలా లేదు.

సీతమ్మ సుకుమార్ కోసం ప్రత్యేకించిన గది ఒకటికి పదిసార్లు తిరిగి చూసింది. 'కొట్టరు కదూ!' అంటూ డాక్టర్ని అడిగింది.

"కొట్టడం ఎందుకమ్మా, ఎందుకు కొట్టామో వాళ్ళకి తెలిస్తే కదా-కొట్టినా అర్థం వుండడానికి! కొట్టం. సాధ్యమైనంత వరకు వాళ్ళు ప్రశాంతంగా వుండేలా మందులిచ్చి ప్రయత్నిస్తాం." అంది సూపర్నెంటుగా వున్న డాక్టరు.

సుకుమార్‌ని అక్కడ వదిలి రావడానికి విలవిల్లాడి పోయింది సీతమ్మ. ఎంతో కష్టం మీద వెనక్కి తిరిగి చూడకుండా వచ్చింది.

నేను క్లినిక్‌లో దిగిపోయాను. 'ధైర్యంగా వుండండి' అని మళ్ళీ మళ్ళీ చెప్పి

వారం రోజులుగా అనుకుంటూనే వున్నాను సీతమ్మని చూసి ధైర్యం చెప్పి రావాలని. కాని ఏదో ఒక పని-తొందర వల్ల వెళ్ళలేకపోయాను.

ఆరోజు శ్రీరామ్మూర్తి వచ్చాడు. "విశేషాలేమిటి?"

కుతూహలం చంపుకోలేక అడిగాను.

"ఏముందీ, ప్రతిరోజూ ఆస్పత్రికి వెళ్ళి రావడం. వాడికి యిష్టమైనవి చేసి సరిగ్గా పదకొండింటికల్లా బయలుదేరక తప్పేది కాదు. కాని నిన్ననే సూపర్నెంటుగారు ఓ ఐదు రోజులు రావద్దన్నారు."

"ఏం? ఎందుకట?"

"అబ్బాయిని ఇక్కడ చేర్పించి ఏం ప్రయోజనం మీరూ రోజూ వస్తూంటే? యిక్కడి వాతావరణానికి అతగాడు సర్దుకోవాలి కదా....

అప్పుడప్పుడు వచ్చి చూడండి' అంది. అంచేత...."

'ఏదామె?' అడిగాను.

"గుళ్ళోకి వెళ్ళింది....సీతమ్మ చాలా ఆందోళన పడిపోతోంది. ఒక్క క్షణం ఒక్క పని చేయలే నంత తీవ్రమైన మానసికారాటంతో కొట్టుమిట్టాడి పోతోంది.... భజన లంటుంది. బాజా లంటుంది.రోజూ తలస్నానం,ఒంటిపొద్దులు యివన్నీ వాడు పుట్టినప్పటినుంచీ అలవాటే కాని. యీ మూఢ భక్తి కొత్తగా పాదుకొంటూంది'' అన్నారు.

"కొడుకుని నాలుగు రోజులు చూడకుండా వుండాలంటే ఆ తల్లి మనస్సు అలా కొట్టుకుంటూంది. ఓర్పువహించండి'' అన్నాను.

"ఎప్పుడు డాక్టరు పెట్టిన గడువు తీరిపోతుందా. ఎప్పుడు రెక్కలు కట్టుకువెళ్ళి కొడుకు ముందు వాలు దామా అని వుంది సీతమ్మ. రేపు వెళ్ళేప్పుడు మీరూ వస్తారా?'' అడి గారు.

"అలాగే. ఉదయం కదా-వస్తాను" అన్నాను.

ఉదయం నేను వాళ్ళింటికి వెళ్ళే సరికి సీతమ్మ చాలా హడావిడిగా వుంది చిరుచెమటలో తడిపిన ఆమె నుదిటి కుంకుమ రక్తంలా కన్పి స్తూంది. చెంపలు కంది ఎర్రగా కన్పిస్తున్నాయి కళ్లు వింత ఆశతో మెరుస్తున్నాయి.

"వాడి కిష్టమయినవన్నీ చేశాను. మీ రింకెంత ఆలస్యం చేస్తారో అని భయపడిపోయాను డాక్టరు గారూ" అంటూ సర్దిన బాస్కెట్ చేత పట్టుకుంది.

మౌనంగానే కూర్చున్నాం అంతా. ఎందుకో తెలియదు,అందరిలోఏదో తెలియనిభయం గూడుకట్టుకున్నట్టు అనిపించింది.

నర్సు గది తలుపు తెరిచింది.

చాలా ఆత్రంగా 'కన్నా,కన్నా' అంటూ సీతమ్మ గదిలోకి అడుగు పెట్టింది. అంతే కిటికీలోకూర్చున్న సుకుమార్ అమాంతం సీతమ్మ మీదపడి చేతిలో బాస్కెట్ లాక్కు న్నాడు. తిరగబోశాడు. కింద పోసినవన్నీ ఏరుకు తినడం ప్రారం భించాడు. తల నిమరబోయిన సీతమ్మని ఒక్కతోపు తోశాడు. సీతమ్మకివన్నీ యింటి దగ్గిర అల వాటే. కాని ఆమె కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూంది. తనక్కావ లసినవి తిని, సుకుమార్ వెళ్ళి కిటికీలో కూర్చున్నాడు. కూర్చున్న తీరు పిచ్చివాడి తీరుగా తోచింది సీతమ్మకి.

"నా కొడుక్కి పిచ్చెత్తింది డాక్టరుగారూ! వా డెప్పుడూ నడచి ఎరగడు!" గట్టిగా అరిచింది.

"ఉష్.... అలా గోల చేయ కండి" హెచ్చరించింది నర్సు.

"వా డిప్పుడూ నడవలేదమ్మా.

ఎగిరాడు. దేకాడు.... అంతే. నీచేతి వంట చూశావా ఎంత ఆత్రంగా తిన్నాడో" శ్రీరామ్మూర్తి ఓదార్పుగా అంటూ భార్యని బయటికి నడిపించుకు రావాలని చూశాడు.

సీతమ్మ విదిలించుకుంది.

"కాని.... వాడు నన్ను చూడలేదండీ! వాడు.... వాడు నన్ను గుర్తించనేలేదు"కొంగుతో ముఖం కప్పుకొని భోరుమంది.

బలవంతంగా సీతమ్మని గదిలోంచి యివతలకి తీసుకొచ్చాం.

సూపర్నెంటుగారు పల్కరించి. "యింక మీరింత రెగ్యులర్‌గా రానక్కర లేదు"అన్నాడు అతి సామాన్యంగా.

"డాక్టరుగారూ, వాడు నన్ను గుర్తించలేదండీ, మీరేదో మందు పెట్టేశారు!" ఏడుస్తూనే అంది సీతమ్మ

"వా డెప్పుడు నిన్ను గుర్తించాడమ్మా? వా డెప్పుడూ నిన్ను గుర్తించలేదు. అలవాటు ప్రకారం, ఆ టయింకి నువ్వొస్తే నీ మీదపడి లాక్కునేవాడు. ఇప్పు డిక్కడ ఎవరుపడ్తే వాళ్ళమీద పడతాడు! ఆ రోగలక్షణమే అంత, జంతుబలమేగాని బుద్ధి బలం పిసరంత వుండదు....నిన్ను తల్లి అనీ, నీ చేతి వంట ఎంతో రుచి అనీ.... అలా పడేవాడని....అమాయకంగా నమ్మి నీ హృదయాన్ని మభ్యపెట్టుకుని యీ పిచ్చివాడి మీద పాశం పెంచుకున్నావు. అంతే! ఇన్నాళ్ళ తరువాత యిప్పుడేనా కాస్త విశ్రాంతిగా బ్రతకండి" అంటూ పని అయిందన్నట్టు కుర్చీలోంచి లేచింది.

ఎలాగో కార్లో యింటి కొచ్చిపడ్డాం.

సీతమ్మ యింక ఏడవదేమో ననిపించింది నాకు. ఆమె ఉన్నతీరు భయంకల్గించిందికూడా. 'ధైర్యంగా వుండాలి' అంటూ హెచ్చరించాను క్లినిక్‌కి బయలుదేరబోతూ.

"డాక్టరుగారూ, వాడు పిచ్చివాడు- పాశంయిట్టేతెంచుకున్నాడు. నేనెలా తెంచుకోవాలి? చెప్పండి డాక్టరుగారూ!" అంటూ నా పాదాల దగ్గర కుప్పగా కూలిపడింది సీతమ్మ

అదే ఆమె ఆఖరుమాట. మళ్ళీ సీతమ్మ తల్లి మాట్లాడలేదు. ఆవేదనతో, ఆవేశంతో ఉవ్వెత్తున ఎగసిన ఆమెవూపిరి ఆగిపోయింది.

"సీతమ్మా! ఇలాగా తెంచుకున్నావు నీ పాశాన్ని?" అంటూ చెదరిన ఆమె జుట్టు సవరిస్తూ కూర్చుండిపోయాడు శ్రీరామ్మూర్తి.

"'పాశం' అన్నది యింత బలమైనది కాబోలు!" అనుకుంటూ, శిలామూర్తిలా కూర్చున్న వారిని చూస్తూ వుండిపోయాను...సీతమ్మ యింక ఏడ్వలేదు, నా గుండె తేలిక పడింది.

*